క్లుప్తంగా

మండల కమిటీ ఎన్నిక



బయ్యారం : తెలంగాణ పంచాయతీరాజ్ టీచర్స్ యూనియన్(పీఆర్ టీయూ) మండల అధ్యక్షుడిగా గంగావత్ మోహన్, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. ఈ మేరకు గురువారం బయ్యారంలో నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు.

యువకుల శ్రమదానం



నెల్లికుదురు : మండలంలోని రామన్నగూడెంలో గురువారం యువకులు శ్రమదానం చేశారు. చెరువు మత్తడి ప్రాంతంలోని కల్వర్టుపై సిమెంటు కొట్టుకుపోయి రాళ్లు తేలి వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. దీంతో ఎవరూ పట్టించుకోవడం లేదని పీవైఎల్ మండల అధ్యక్షుడు బొంతు దేవరాజు ఆధ్వర్యంలో యువకులతో కలిసి శ్రమదానం చేశారు. తేలిన రాళ్లపై మట్టి పోసి చదును చేశారు. కార్యక్రమంలో సూర్యప్రకాశ్, లక్ష్మణ్, రాజు, రాము, వీరేశం, దైవకృప పాల్గొన్నారు.

చేతిపంపు వద్ద మరమ్మతు



మరిపెడ రూరల్ : భారీ వర్షాలతో మండలంలోని వీరారంలో తాగునీటి చేతిపంపు చుట్టూ మట్టి కోతకు గురైంది. దీంతో గ్రామస్తులు తాగునీరు పట్టుకునేందుకు అవస్థలు పడుతున్నారు. కాగా, గ్రామంలోని కొందరు యువకులు, తక్కెళ్లపల్లి కిశోర్‌రావు ఆధ్వర్యంలో సొంత ఖర్చులతో మరమ్మతు పనులు చేపట్టారు.

బోరుబావికి..

పెద్దవంగర : మండల కేంద్రంలోని పశువుల ఆస్పత్రి సమీపంలో గల బోరుబావి పని చేయడం లేదు. దీంతో మహిళలు ఖాళీ బిందెలతో గురువారం నిరసన వ్యక్తం చేశారు. బోరుకు మరమ్మతులు చేపట్టి నీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముందసాని సురేష్ సొంత ఖర్చులతో కొత్త మోటార్‌ను ఏర్పాటు చేయించారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

దంతాలపల్లి : పాఠశాలలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం బాగుందని ఎంపీడీఓ వివేక్‌రామ్ అన్నారు. జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన భోజనాన్ని ఆయన పరిశీలించారు. హెచ్‌ఎం వేణుమాధవరెడ్డి వర్షాలు వచ్చినప్పుడు పాఠశాల ఆవరణ బురదగా మారుతోందని ఎంపీడీఓకు తెలిపారు.

నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

తొర్రూరు : గణపతి విగ్రహాల నిమజ్జనాలు ప్రశాంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సీఐ జగదీశ్ తెలిపారు. డివిజన్ కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఆయా మండలాల ఉత్సవ కమిటీల నిర్వాహకులతో గురువారం సమావేశం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, కమిషనర్ శాంతికుమార్, ఎస్సైలు ఉపేందర్, పిల్లల రాజు, క్రాంతి కిరణ్, రమేష్‌బాబు పాల్గొన్నారు.

ఏర్పాట్లు పూర్తి చేయాలి

మహబూబాబాద్ : వినాయక నిమజ్జన ఏర్పాట్లు పూర్తి చేయాలని మున్సిపల్ వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న అధికారులకు ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయంలో గురువారం నిమజ్జనం ఏర్పాట్లపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కమిషనర్ నోముల రవీందర్, డీఈ ఉపేందర్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదివాసీ రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దు



గూడూరు : అటవీశాఖ అధికారులు ఏజెన్సీ గ్రామాల్లో పోడు రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దని ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ దాట్ల నాగేశ్వర్‌రావు, కన్వీనర్ ఈసం సుధాకర్ కోరారు. మండలంలోని మట్టివాడ శివారు నేలవంచ గ్రామాన్ని గురువారం వారు సందర్శించారు. పోడు రైతుల పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. కమిటీ సభ్యులు సారయ్య, మల్లేష్, నరేష్ పాల్గొన్నారు.

కేంద్రం విధానాలను తిప్పికొట్టాలి

మరిపెడ రూరల్ : తెలంగాణ భవన ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమానికి ఉపయోగపడే సంక్షేమ బోర్డును బీమా రంగాలకు తాకట్టు పెట్టాలని కేంద్ర ప్రభుత్వం చూస్తోందని, కార్మికులు ప్రజా పోరాటాల ద్వారా తిప్పికొట్టాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దుండి వీరన్న అన్నారు. గురువారం మండలంలోని ఎల్లంపేట గ్రామంలో ఏర్పాటు చేసిన భవన నిర్మాణ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. గుడిసె శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు కోటపాటి రమేష్, ప్రధాన కార్యదర్శి సందీప్, కోశాధికారి బుర్గుల ఉపేందర్, దాట్ల సైదులు, ఐనాల సైదులు, ఎస్‌కే మౌలాన, కమిటీ సభ్యులు లక్ష్మయ్య, గోపి, వెంకన్న పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకుందాం..



మరిపెడ రూరల్ : సీతారాంతండాలో విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేస్తున్న నర్మద



డోర్నకల్: సరుకులు పంపిణీ చేస్తున్న నాయకులు



నెల్లికుదురులో..



నెహ్రూసెంటర్ : కార్మికుల కుటుంబాలకు నిత్యావసరాలు అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

- జెడ్పీ సీఈఓ నర్మద

మరిపెడ రూరల్ : ముంపు గ్రామాల్లోని బాధితులను ఆదుకుందామని, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి నష్టం జరగకుండా చూడాలని జెడ్పీ సీఈఓ నర్మద సంబంధిత అధికారులను ఆదేశించారు. ముంపునకు గురైన మండలంలోని సీతారాంతండా ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు హైదరాబాద్ ఈస్ట్ జోన్ బిల్డర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పంపిణీ చేసిన దుస్తులు, నగదును గురువారం పంపిణీ చేశారు. దుస్తులు, నోట్ పుస్తకాలు అందజేసిన అసోసియేషన్ వారికి ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీ డీ ఓ విజయ, ఎంపీఓ సోంలాల్, అంగన్‌వాడీ టీ చర్ భగవతి, హెచ్‌ఎం, అసోసియేషన్ బృందం విక్రమ్, అక్షయ్, అభినవ్, ప్రశాంత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అండగా నిలుస్తున్న దాతలు

మండలంలోని ఉల్లెపల్లి, సీతారాంతండా, బాల్నిధర్మారం గ్రామాల్లోని ముంపు బాధిత కుటుంబాలకు హైదరాబాద్ ఈస్ట్ జోన్ బిల్డర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సుమారు 200 కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.1,500 విలువ గల నిత్యావసర కిట్ గురువారం పంపిణీ చేశారు.

సుమాంజలి విహార్ అపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో..

మహబూబాబాద్‌కు చెందిన సుమాంజలి విహార్ అపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఉల్లెపల్లి గ్రామానికి చెందిన బాధిత కుటుంబాలకు తహసీల్దార్ సైదులు నిత్యావసర సరుకులు అందజేశారు.

డాక్టర్ మనోకృష్ణ జ్ఞాపకార్థం..

మరిపెడకు చెందిన డాక్టర్ మనోకృష్ణ జ్ఞాపకార్థంగా అతని పురస్కరించుకొని తల్లిదండ్రులు గుగులోత్ నామ, శోభ దంపతులు రూ.60 వేల విలువైన నిత్యావసర సరుకులను సీతారాంతండా బాధిత కుటుంబాలకు గురువారం పంపిణీ చేశారు. మనోజ్‌రెడ్డి, లింగాల మహేష్‌గౌడ్, దోమల లింగయ్య, ఇస్లావత్ నగేష్ పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

నెల్లికుదురు : మండలంలోని రావిరాల, శ్రీరామగిరి గ్రామ వరద బాధితులకు నిర్మల్ ఆర్గనైజేషన్ సంస్థ సహకారంతో ఇన్ఫోసిస్ కార్పొరేట్ సౌజన్యంతో గురువారం నిత్యావసరాలను అందించినట్లు ఎంపీడీఓ బాలరాజు తెలిపారు. ఆర్గనైజేషన్ మేనేజర్ ఉపాకర్, మహేందర్, రామకృష్ణ పాల్గొన్నారు.

డోర్నకల్ : సీరోలు మండలం దుబ్బగడ్డ తండా, మోదుగ గడ్డతండాల్లో వరద బాధితులకు గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. బత్తుల శ్రీనివాస్‌యాదవ్, వాంకుడోత్ వీరన్న, కేశబోయిన కోటిలింగం, శ్రీనివాస్, సుమేర్‌చంద్‌జైన్, రవిందర్‌రెడ్డి, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

చిన్నగూడూరు : మన్నెగూడెంలో ఆకేరు వరద బాధితులకు జెడ్పీఎస్ఎస్ జయ్యారం 2004 బ్యాచ్ పూర్వవిద్యార్థులు బొమ్మకంటి వెంకట్, అలువాల కృష్ణ, భరత్‌రెడ్డి, వెల్లి ప్రవీణ్ తుడం అజయ్, కుర్రె అశోక్, ఎస్ నరేష్ సహకారంతో గ్రామస్తులకు నిత్యావసర సరుకుల పంపిణీ చేశారు. కుర్రె సోమయ్య, బొడ్డుపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.



మరిపెడ రూరల్: సరుకులు పంపిణీ చేస్తున్న నామ

కార్మిక కుటుంబాలకు సరుకుల పంపిణీ

నెహ్రూసెంటర్ : వర్షాల కారణంగా తీవ్రంగా నష్టపోయిన కార్మికుల కుటుంబాలకు సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం సీపీఎం జిల్లా కార్యాలయంలో నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ మాట్లాడారు. రాజు, ఉపేందర్ పాల్గొన్నారు.

ఈ-నామ్ సర్వర్ డౌన్..

- పనిచేయని రిపోర్ట్ సర్వర్.. మాన్యువల్‌గా రాసిచ్చిన సిబ్బంది
- ఇబ్బందులు పడిన రైతులు

కేసముద్రం : ఈ-నామ్ సర్వర్ డౌన్ అవ్వడంతో ప్రింట్‌అవుట్ పనిచేయలేదు.. దీంతో మార్కెట్ సిబ్బంది లాట్‌నంబర్ చీటీలు, ధరలు, తక్‌పట్టీలను మాన్యువల్‌గా రాసివ్వడంతో అన్నదాతలు ఇబ్బందులు పడిన సంఘటన కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో గురువారం చోటుచేసుకుంది. గురువారం ఈ-నామ్‌లో విధానంలో కేవలం మెయిన్ సర్వర్ మాత్రమే పనిచేయడంతో, వ్యాపారులు లాట్‌లకు వేసిన ధరలను తీసుకుంది. కాని రిపోర్ట్ సర్వర్ పనిచేయకపోవడంతో లాట్ నెంబర్ చీటీ, విన్నర్‌లిస్టు ప్రింట్ అవుట్ రాలేదు. దీంతో ఉదయాన్నే మాన్యువల్‌గా రాసిచ్చిన లాట్‌నంబర్ చీటీలపై, సరుకులకు పడిన ధరలను, సిస్టం స్క్రీన్‌పై చూస్తూ డాటాఎంట్రీ ఆపరేటర్‌లు రాసివ్వాల్సి వచ్చింది. దీంతో మార్కెట్లో క్రయ,విక్రయాలు ఆలస్యం అయ్యాయి. మొత్తానికి 179 లాట్‌లు వచ్చినట్లు అధికారులు తెలిపారు. దీనిపై స్పెషల్ గ్రేడ్ సెక్రటరీ అమరలింగేశ్వర్‌రావును వివరణ కోరగా, దేశవ్యాప్తంగా ఈ-నామ్ సర్వర్ డౌన్ అయినట్లు తెలిపారు.

తప్పతాగి.. 100కు డయల్ చేసి..

కురవి : మద్యం మత్తులో 12సార్లు డయల్-100కు ఫోన్ చేశాడో ప్రబుద్ధుడు. అప్రమత్తమైన కానిస్టేబల్ కాల్ చేసిన వ్యక్తి వద్దకు వెళ్తే కానిస్టేబుల్‌పైనే తిరగబడ్డాడు. దీంతో అతనిపై కేసు నమోదు చేసినట్లు కురవి ఎస్సై గండ్రాతి సతీష్ గురువారం తెలిపారు. మండలంలోని నారాయణపురం శివారు ధరావత్ తండాకు చెందిన ధరావత్ బావుసింగ్ ఈనెల 1వ తేదీన రాత్రి 9.30 గంటల నుంచి తెల్లవారుజామున 2 గంటల వరకు మద్యం మత్తులో ఏకంగా 12 సార్లు డయల్-100కు ఫోన్ చేసినట్లు తెలిపారు. బ్లూకోల్ట్ కానిస్టేబుల్ కాశీరాం అప్రమత్తమై రాత్రి సమయంలో ఏం ఇబ్బంది జరిగిందో అని వెంటనే తండాకు వెళ్లాడు. డయల్ చేసిన వ్యక్తి ఎక్కడున్నాడని ఫోన్‌లో సంప్రదిస్తే అక్కడ ఉన్నా.. ఇక్కడ ఉన్నా అంటూ తండా మొత్తం తిప్పాడు. ఎట్టకేలకు అతని దగ్గరకు వెళ్లి ఏం సమస్య అని కానిస్టేబుల్ అడిగాడు. మద్యం మత్తులో ఉన్న సదరు వ్యక్తిని తప్పుడు కాల్స్ చేయొద్దని కానిస్టేబుల్ వారించగా..అలాగే ఫోన్ చేస్తా.. మీరు రావాల్సిందే అంటు కానిస్టేబుల్‌ను నెట్టేశాడు. కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు బావ్‌సింగ్‌పై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్సై సతీష్ తెలిపారు.

గీత కార్మికులకు రక్షణ కిట్‌పై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న కిరణ్‌నాయక్

నర్సింహులపేట : నర్సింహులపేట, మరిపెడ, దంతాలపల్లి, చిన్నగూడురు మండలాల్లోని గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కిట్లపై గురువారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఎక్సైజ్ జిల్లా సూపరింటెండెంట్ కిరణ్‌నాయక్ పాల్గొని మాట్లాడారు. గీత కార్మికులకు ప్రమాదాల నివారణ కోసం ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి నర్సింహస్వామి మాట్లాడారు. ప్రభుత్వ పథకాలను గీత కార్మికులు ఉపయోగించుకోని ఆర్థికంగా నిలబడాలన్నారు. అనంతరం తాటివనంలోకి వెళ్లి గీత కార్మికులు రక్షణ కిట్లు ధరించి చెట్టును ఎలా ఎక్కాలో, చెట్టుపై ఏదైనా ప్రమాదం జరిగితే ఎలా కిట్లను ఉపయోగించాలో శిక్షణ ఇస్తు పరిశీలించారు. తొర్రూర్ ఎక్సైజ్ ఎస్సై తిరుపతి, గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు యమగాని వెంకన్న, రాష్ట్ర కమిటీ సభ్యుడు గునిగంటి మోహన్, గాడిపల్లి రవి, జినుకల రమేష్, రామన్న తదితరులు పాల్గొన్నారు.

సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తున్నారు



సమావేశంలో మాట్లాడుతున్న సాదుల శ్రీనివాస్

డోర్నకల్ : స్వార్థం కోసం కొన్ని రాజకీయ పార్టీలు తెలంగాణ సాయుధ పోరాటాన్ని వక్రీకరిస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటం జరిగిన గ్రామాల మీదుగా సాగుతున్న శౌర్య యాత్ర గురువారం మండలంలోని పెరుమాళ్లసంకీసకు చేరుకుంది. ఈ సందర్భంగా పోరాట యోధుల కుటుంబ సభ్యులను సన్మానించారు.శౌర్య యాత్ర బృందం సభ్యులు తెలంగాణ సాయుధ పోరాట ఘట్టాలను వివరిస్తూ ప్రదర్శించిన నాటకాలు స్థానికులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటాలను ప్రజలు వివరిస్తూ పోరాట స్ఫూర్తిని కొనసాగించేందుకు నెల రోజుల పాటు 159 పోరాట కేంద్రాల మీదుగా శౌర్య యాత్ర కొనసాగుతుందన్నారు. సాయుధ పోరుకు కమ్యూనిస్టులు సారథ్యం వహించగా కొన్ని పార్టీల నాయకులు పోరాటచరిత్రను వక్రీకరిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ప్రజానాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి కట్టా నర్సింహ, సీపీఎం నాయకులు శెట్టి వెంకన్న, బొబ్బ వెంకటరెడ్డి, యు.శ్రీనివాస్, బొమ్మన అశోక్‌కుమార్, తుమ్మ విష్ణువర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలి

గార్ల/ దంతాలపల్లి : నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌కే యాకూబ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి, మాట్లాడారు. అలాగే దంతాలపల్లి మండల కేంద్రంతో పాటు బొడ్లాడ, దాట్ల, రేపోణి, పెద్దముప్పారం గ్రామాల పాఠశాలలను సందర్శించారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా కార్యదర్శులు గుగులోత్ భద్రు నాయక్, ఎస్.మంగయ్య, మండల అధ్యక్షుడు మాచర్ల సుందర్‌కుమార్, ఎస్‌కే షరీఫ్, కె. దేవేందర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, నాగమల్లయ్య, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొండ యాకన్న, కొమ్మెనబోయిన వంశీకృష్ణ, విజయకుమార్, పార్వతిరాథోడ్, రమేష్, చిరంజీవి, వెంకన్న, కళ్యాణ్ రామారావు పాల్గొన్నారు.

బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి

- టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం



కురవి : మోడల్ స్కూల్‌లో పనిచేస్తున్న టీచర్లకు బదిలీలు, పదోన్నతులు కల్పించాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చుంచు శ్రీశైలం డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంతోపాటు మోద్గులగూడెం, మోడల్ స్కూల్, కేజీబీవీల్లో సమావేశాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేజీబీవీ టీచర్లను రెగ్యులరైజ్ చేయాలని, సీపీఎస్‌ను బేషరతుగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బొల్లం శ్రీనివాస్, బలాస్టి రమేష్, గుండ్ల విజయ్‌కుమార్, ఓదెల శివకుమార్, వి.విజయ్‌రాజ్, జి.కార్తీక్, బి.బాలరాజు పాల్గొన్నారు.

బస్సు సర్వీసులు పునరుద్ధరించాలి

కొత్తగూడ : ఏజెన్సీ గ్రామాలకు ఆర్టీసి బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు వాసం సారయ్య డిమాండ్ చేశారు. గురువారం మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్తగూడ, గంగారం మండలాలకు కేవలం మూడు సర్వీస్‌లు మాత్రమే నడుస్తున్నాయన్నారు. దీంతో ఒక్క బస్సులో సుమారు 150 మంది ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొందని పేర్కొన్నారు. గుండం, కోనాపురం, పూనుగొండ్ల, మహబూబాబాద్ నుంచి కొత్తగూడ సర్వీస్‌లను వెంటనే పునరుద్ధరించాలని కోరారు. ఈసమావేశంలో నాయకులు జాడి సారయ్య, మునెందర్, కొట్టె శ్రీనివాస్, రూప్ల, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏచూరి సేవలు మరువలేనివి



నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

నెహ్రూసెంటర్ /నెల్లికుదురు/బయ్యారం/కురవి: సీపీఎం ఆల్ ఇండియా ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సేవలు మరువలేనివని, ఆయన మృతి బాధాకరమని సీపీఎం నాయకులు అన్నారు. ఈ మేరకు ఆయా మండల కేంద్రాల్లో ఏచూరి చిత్రపటానికి నివాళులర్పించారు. సీతారాం ఏచూరి దేశానికే ఆదర్శమని, ఆయన ఆశయ సాధనకోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు.ఆయా కార్యక్రమాల్లో సీపీఎం నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

డోర్నకల్ : పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఏఎస్సై కోటేశ్వర్ రావు తెలిపిన వివరాలు.. మండలంలోని జోగ్యా తండాకు చెందిన చాందావత్ భద్రు(30)కు మానసిక స్థితి సక్రమంగా లేదు. అలాగే వివాహం కాకపోవడంతో తల్లిదండ్రుల వద్దే ఉంటున్నాడు. బుధవారం తల్లిదండ్రులతో కలిసి మిర్చితోట వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో తోటకు పిచికారీ చేసేందుకు తెచ్చిన పురుగు మందును భద్రు తండ్రి చెట్టు కింద పెట్టి దుక్కి దున్నుతున్నాడు. కాగా అక్కడికి వెళ్లిన భద్రు పురుగుల మందు తాగాడు. ఇదే విషయాన్ని తన తండ్రికి చెప్పడంతో వెంటనే భద్రును ఖమ్మంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు.

వినాయక నిమజ్జన ఊరేగింపులో ఘర్షణ

మహబూబాబాద్ రూరల్ : వినాయకుడి నిమజ్జనం సందర్భంగా గురువారం రాత్రి ప్రభుత్వ, ఓ ప్రైవేటు ఆస్పత్రిల్లో పనిచేసే సిబ్బంది మధ్య వాగ్వివాదం జరిగి ఘర్షణకు దారితీసింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో, పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రి ఎదుట ఏర్పాటు చేసిన గణనాథుల నిమజ్జన ఊరేగింపులు మధ్యాహ్నం ప్రారంభమయ్యాయి. ఊరేగింపులు రెండు కూడా కొత్త కూరగాయల మార్కెట్ నుంచి శ్రీనివాస టాకీసు వద్దకు చేరుకోగానే ప్రభుత్వ, ఓ ప్రైవేటు ఆస్పత్రిల్లో పనిచేసే సిబ్బంది మధ్య వాగ్వివాదం జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని రెండు వర్గాల ఊరేగింపును వారించి అక్కడి నుంచి పంపించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మండలంలోని వేమునూరు గ్రామానికి చెందిన నలమాస వంశీ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో పేషెంట్ కేర్ విధులు నిర్వహిస్తున్నాడు. గురువారం రాత్రి వినాయకుడి నిమజ్జనం ఊరేగింపులో పాల్గొని తన ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తున్నాడు. మహర్షి విద్యాలయ సమీపంలో బైక్ అదుపుతప్పి పడిపోగా అతడికి తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకువెళ్లారు.

రైతులకు రూ.లక్ష పరిహారం చెల్లించాలి

- ఏఐపీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రంగయ్య



సమావేశంలో మాట్లాడుతున్న రంగయ్య

నెహ్రూసెంటర్ / నెల్లికుదురు : ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా పంటలు నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ఎకరాకు రూ. లక్ష నష్టపరిహారం చెల్లించాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం (ఏఐపీకేఎస్) రాష్ట్ర అధ్యక్షుడు కేచ్చల రంగయ్య డిమాండ్ చేశారు. నెల్లికుదురు మండలంలోని వివిధ గ్రామాల్లోని వరద ప్రభావిత ప్రాంతాల్లో సంఘం రాష్ట్ర బృందం పర్యటించింది. అనంతరం జిల్లా కేంద్రంలోని సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వరదలతో నష్టపోయిన ప్రజలను, రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆయన ధ్వజమెత్తారు. మంత్రులు, అధికారులు పర్యటనలు చేసి హామీలు ఇచ్చారే తప్పా అమలుకు నోచుకోలేదన్నారు. వరదలకు తెగినపోయిన చెరువుల మరమ్మతులకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలన్నారు. చెరువులు, వాగుల పరివాహక ప్రాంతాల్లో ఉన్న గ్రామాలను ఎత్తైన ప్రాంతాలకు తరలించి పునరావాసం కల్పించాలన్నారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గోకనపల్లి వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి పాయం చంద్రన్న, సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి, నాయకులు ఆవుల వెంకటేశ్వర్లు, ముల్కూరు జగ్గన్న, ముంజంపల్లి వీరన్న, బిల్లకంటి సూర్యం, బండపల్లి వెంకటేశ్వర్లు, ఉమ్మగాని సత్యం, పైండ్ల యాకయ్య, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

కేసముద్రం : కల్వల మోడల్ స్కూల్, కళాశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి జూనియర్స్ బాల, బాలికల బేస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రవి గురువారం తెలిపారు. విద్యార్థులను ఉపాధ్యాయులు, అధ్యాపకులు అభినందించారు.

కురవి : రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీలకు మండలంలోని నేరడ జెడ్పీ హైస్కూల్‌తోపాటు, మోడల్ స్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు పీడీలు సమ్మెట ప్రేమ్‌కుమార్, ఐనాల సురేష్ గురువారం తెలిపారు. ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎం బాలాజీ, ప్రిన్సిపాల్ అరుణ్, ఉపాధ్యాయులు అభినందించారు.

వినాయకుడి సన్నిధిలో పూజలు



మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ పట్టణంలోని 26వ వార్డు కాకతీయ కాలనీలో స్థానిక కాకతీయ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడి సన్నిధిలో గురువారం భక్తులకు అన్నప్రసాదం పంపిణీ ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా డీఎస్పీ ఎన్.తిరుపతిరావు, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రామ్మోహన్ రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, పద్మం ప్రవీణ్ కుమార్ హాజరై వినాయకుడికి పూజలు చేశారు. అలాగే కాంగ్రెస్ అర్బన్ అధ్యక్షుడు ఘణపురపు అంజయ్యమొక్కులు చెల్లించుకున్నారు.

గణపతి మండపాల వద్ద అన్నదానం

కేసముద్రం /బయ్యారం/ తొర్రూరు రూరల్ / మరిపెడ: ఆయా మండలాల్లోని అన్ని గ్రామాలు, గిరిజన తండాల్లో ఏర్పాటు చేసిన గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో విగ్రహాల, అన్నదాన దాతలు, నిర్వాహకులు, యువజన సంఘాల నాయకులు, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

గణనాథుల నిమజ్జనం

గార్ల /డోర్నకల్ : గార్లలోని సినిమా హాల్ బజారులో మాజీ సర్పంచ్ అజ్మీర బన్సీలాల్ ఏర్పాటు చేసిన గణనాథుడిని, డోర్నకల్ స్థానిక సాయినగర్ రెండో వీధిలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను గురువారం స్థానిక పాకాల ఏటిలో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అన్నదానానికి బియ్యం అందజేత



గార్ల : గార్ల పట్టణంలో ఏర్పాటు చేసిన 27 గణపతి విగ్రహాల వద్ద అన్నదానం కోసం దాత బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ గంగావత్ లక్ష్మణ్‌నాయక్ గురువారం 13.5 క్వింటాళ్ల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో గంగావత్ భారతి, రాధాకృష్ణ, రమేష్, గణేష్, యాకూబ్‌పాషా, శ్రీనివాస్, ఉమేష్, శ్రీనివాస్, సంపత్, రవీందర్, సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.

కోటి లలితా పారాయణం

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ పట్టణంలోని వాసవీ ఆలయంలో కోటి లలితా పారాయణం, సామెత కోటి పారాయణాన్ని గురువారం మహిళలు భక్తిశ్రద్ధలతో పఠించారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

మరిపెడ రూరల్ : మండలం చిల్లంచర్ల జెడ్పీఎస్ఎస్ విద్యార్థులకు స్ఫూర్తి ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో సంస్థ ప్రతినిధి కృష్ణయ్య ఎన్ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్‌ను గురువారం అందజేశారు.

ఆధ్యాత్మిక సేవలు ప్రశంసనీయం

మహబూబాబాద్ రూరల్ : లక్ష్మీవెంకటేశ్వర సేవా ట్రస్టు సభ్యులు నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమని ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ అన్నారు. ట్రస్టు వెబ్‌సైట్‌ను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మురళీనాయక్ బుధవారం రాత్రి ప్రారంభించారు. ట్రస్టు అధ్యక్షుడు గర్రెపల్లి నవీన్ కుమార్, కార్యదర్శి కొత్తూరు లీలావతి, మంచాల యాదగిరి పాల్గొన్నారు.

అవగాహన

కేసముద్రం : వ్యవసాయ మార్కెట్ యార్డులో, పీహెచ్‌సీ ఆవరణలో గురువారం సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ సంస్థ ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహన నిర్వహించారు.

రాహుల్ వ్యాఖ్యలు సరికాదు

మహబూబాబాద్ అర్బన్ : రాహుల్ గాంధీ విదేశాలకు వెళ్లిన ప్రతిసారి భారత దేశ ఔన్నత్యాన్ని, సంస్కృతిని కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం సరికాదని బీజేపీ అధికార ప్రతినిధి ఇందుభారతి అన్నారు. జిల్లా కేంద్రంలోని వివేకనంద సెంటర్‌లో బీజేపీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు.

మత్స్యకార్మికులకు నష్టపరిహారం చెల్లించాలి

మరిపెడ : వరదలతో చెరువులు గండ్లుపడి చేప పిల్లలు కొట్టుకపోవడంతో నష్టపోయిన మత్స్యకారులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని ముదిరాజ్ మహాసభ జిల్లా కార్యదర్శి పిట్టల ధనుంజయ కోరారు.ఈ మేరకు మరిపెడలో ముదిరాజ్ వాహన స్టిక్కర్లను ఆయన విడుదల చేశారు.

వినతి

మహబూబాబాద్ : ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో గల వాకింగ్ ట్రాక్‌కు మరమ్మతు చేయాలని ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు పి.మల్లయ్య , కోశాధికారి సదానందం, ప్రధాన కార్యదర్శి ఎ.సాంబయ్య తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మండలంలోని సోమ్లతండా ప్రాథమిక పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు వీడ్కోలు, సన్మాన కార్యక్రమం పర్వతగిరి జెడ్పీ హైస్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీరాములు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. బదిలీ అయిన ఉపాధ్యాయులు తమ గుర్తుగా విద్యార్థులకు భోజనం ప్లేట్లు బహూకరించారు.

వ్యాసరచన పోటీలు

కురవి : మండల కేంద్రంలోని సిద్ధార్థ విద్యాలయంలో శ్రీ సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో గురువారం వ్యాసరచన పోటీలను నిర్వహించారు. 8 నుంచి 10వ తరగతి విద్యార్థులు పోటీలో పాల్గొన్నారు. తిరుమలరావు, అల్వాల కార్తీక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలి



గార్ల : ఆశ వర్కర్లకు కనీస వేతనం నెలకు రూ.26,000 చెల్లించాలని సీఐటీయూ మండల కన్వీనర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ముల్కనూరు పీహెచ్‌సీ ఎదుట ధర్నా నిర్వహించారు. ధర్నా అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని పీహెచ్‌సీ డాక్టర్ రాజ్‌కుమార్ జాదవ్‌కు అందజేశారు.

మండల కమిటీ ఎన్నిక

దంతాలపల్లి : డీజే మండల యూనియన్‌ను గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడి సెగ్గం నరేష్, ఉపాధ్యక్షుడిగా పులుగుజ్జ ప్రశాంత్, సభ్యులుగా సెగ్గం గణేష్, భరత్, సాయి, బాలాజీ, సందీప్, అర్జున్, తదితరులను ఎన్నుకున్నారు.

పరామర్శ

మహబూబాబాద్ రూరల్ : సీపీఎం మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సూర్నపు సోమయ్య సతీమణి సావిత్రమ్మ ఇటీవల మృతిచెందగా ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు గురువారం ఆమె చిత్రపటం వద్ద నివాళులర్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

ఫీవర్ సర్వే నిర్వహించాలి

గూడూరు : గ్రామాల్లో ఆశ కార్యకర్తలు ప్రతీ రోజు ఇంటింటికి వెళ్లి జ్వర సర్వే నిర్వహించాలని జిల్లా డిప్యూటీ మాస్ మీడియా ఆఫీసర్ కొప్పుల ప్రసాద్ అన్నారు. మండలంలోని అయోధ్యపురం పీహెచ్‌సీలో గురువారం డాక్టర్ యమున అధ్యక్షతన మండల ఆశ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్వర సర్వేతో పాటు పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రజలకు ఎలా అవగాహన కల్పించాలో వివరించారు. కార్యక్రమంలో డీపీఎంఓ రవీందర్, లవరాం, హెల్త్ ఎడ్యుకేటర్ పురుషోత్తం, రాజు, లోక్యానాయక్, మేరి, సిబ్బంది పాల్గొన్నారు.